ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 17 జనవరి 2024

నేడు ఢిల్లీకి మాజీ సీఎం కుమారస్వామి

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి అర్జున్ ముండా ప్రత్యేక ఆహ్వానం మేరకు మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి బుధవారం ఢిల్లీకి వెళుతున్నారు. కొబ్బరికి మద్దతు ధర, కాడుగొల్ల కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు తదితర అంశాలపై బీజేపీ అధిష్టానం పెద్దలతో కుమారస్వామి చర్చలు జరిపే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా బీజేపీ రాష్ట్ర నేతలు కొద్దిరోజులుగా మాజీ ప్రధాని దేవెగౌడను, మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామిని భేటీ అవుతుండం రాజకీయ ప్రాధాన్యత ను సంతరించుకుంది.

మతతత్వ శక్తులపై ఉక్కు పాదం


పోలీసు ఉన్నతాధికారుల సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం

- బీజేపీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు
- ప్రజలు సంయమనం పాటించాలి
- సామరస్యాన్ని దెబ్బతీస్తే సహించే ప్రశ్నే లేదు
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య హెచ్చరిక

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో మతతత్వ, సంఘ విద్రోహశక్తులు తోకలు జాడిస్తున్నాయని, వీటిపై గట్టి నిఘా వేసి ఉంచాలని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య సూచించారు. బెంగళూరులోని డీజీపీ కార్యాలయంలో మంగళవారం పోలీసు ఉన్నతాధికారుల వార్షిక సమావేశాన్ని ప్రారంభించారు. ఈనెల 22న అయోధ్యలో రామమందిర ప్రారంభ కార్యక్రమం నేపథ్యంలో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా చూడాలన్నారు. బీజేపీ నేతలు చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యల నేపథ్యంలో ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని కోరారు. ఇటీవలి కాలంలో శాంతిభద్రతలకు ఎదురైన సవాళ్లను దీరోచితంగా ఎదుర్కొన్న పోలీసు అధికారులను ఆయన ప్రశంసించారు. హావేరి జిల్లాలో జరిగిన సామూహిక అత్యాచార ఘటనను ప్రస్తావిస్తూ ఎవరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా సహించవద్దని తెలిపారు. ఈ విషయంలో పోలీసు అధికారులకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నట్టు ప్రకటించారు. పోలీసు అధికారుల బదిలీ విషయంలో కులాలు తెరపైకి వస్తున్న తీరుపై ఆయన ఒకింత ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో వీటి మూలాలను గుర్తించి ఏరిపారేయాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందన్నారు. దళితులు, అణగారిన వర్గాలు, మైనారిటీలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం మరింత ఏర్పడేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. బెంగళూరు నగరంలో పెరుగుతున్న పబ్ సంస్కృతికి ముకుతాడు వేయాలని ఆదేశించారు. బెంగళూరు నగర గ్రామీణ జిల్లాల్లోని పాఠశాలలకు ఇటీవల ఇ-మెయిల్ బెదిరింపులు రావడాన్ని ప్రస్తావిస్తూ పోలీసు ఇంటెలిజెన్స్ వ్యవస్థ మరింత చురుగ్గా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కాగా కర్ణాటక ఏకీకరణ స్వర్ణోత్సవాల నేపథ్యంలో బెంగళూరులో సువర్ణ పోలీసు భవనాన్ని నిర్మించబోతున్నట్టు సీఎం ప్రకటించారు. ఇందుకు రానున్న బడ్జెట్‌లో నిధులను కేటాయిస్తామని తెలిపారు. రాష్ట్రంలో పోలీసులకు నెలవారీ ఇస్తున్న వైద్యఖర్చుల మొత్తాన్ని రూ.1000 నుంచి రూ.1500కు పెంచుతున్నామని, బెంగళూరు నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు మరింత ప్రాధాన్యత ఇచ్చేందుకు మరో 8 అడిషినల్ డీసీపీ పదవులను సృష్టించబోతున్నామని వెల్లడించారు. దళితులపై దౌర్జన్యాల విషయంలో శిక్షలు చాలా తక్కువగా ఉంటున్నాయని సీఎం ఒకదశలో ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు ప్రజలకు సంపూర్ణంగా అందించే దిశలోనే శాంతిభద్రతల పరిరక్షణ విషయంలోనూ పోలీసు యంత్రాంగంపై గురుతర బాధ్యత ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం బాంబు నిరోధకదళాలు, ఫోరెన్సిక్ సైన్స్ మొబైల్ ల్యాబ్, మొబైల్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లను పరిశీలించారు. సమావేశంలో హోంశాఖ మంత్రి డాక్టర్ జి. పరమేశ్వర్, హోం శాఖ కార్యదర్శి ఉమాశంకర్, డీజీపీ అలోక్‌మోహన్‌తోపాటు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


బాంబు స్క్వాడ్‌ను పరిశీలిస్తున్న సీఎం సిద్దరామయ్య

19న రాష్ట్రానికి ప్రధాని మోదీ రాక



బెంగళూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 19న రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. బెంగళూరులో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ స్పెషాలిటీ ఇండి యా, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రధాని లాంచనంగా ప్రారంభించనున్నారు. ఇది అధికారిక కార్యక్రమమైనప్పటికీ ప్రధాని, రాష్ట్ర బీజేపీ నేతలతోనూ ప్రత్యేకంగా సమావేశమయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రధాని పర్యటనలో భాగంగా రోడ్‌షోను ఏర్పాటు చేయాలని బీజేపీ నేతలు భావిస్తున్నారు. కాగా ప్రధాని పర్యటన నేపథ్యంలో ఈనెల 19న జరగాల్సిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని వాయిదా వేసినట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర బెంగళూరులో మంగళవారం మీడియాకు చెప్పారు.

19న కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే పార్టీ అభ్యర్థుల పేర్లపై కసరత్తు చేసేందుకు కేపీసీసీ ఎన్నికల కమిటీ ఈ నెల 19న నగరంలో కీలక సమావేశం నిర్వహించనుంది. ఈ విషయాన్ని కేపీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నగరంలో మంగళవారం మీడియాకు చెప్పారు. 19న సాయంత్రం జరిగే ఈ సమావేశంలో పాల్గొనేందుకు అధిష్టానం తరపున పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్ సింగ్ సుర్జేవాలా, ఏఐసీసీ పరిశీలనా కమిటీ అధ్యక్షుడు హరీష్ చౌదరి పరిశీలకులుగా హాజరు కాబోతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రులు క్షేత్రస్థాయిలో చేసిన అభిప్రాయ సేకరణ నివేదికలను సమర్పిస్తారన్నారు. సాధ్యమైన మేరకు ఒక నియోజకవర్గానికి ఒక అభ్యర్థి పేరునే అధిష్టానానికి సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల బరిలో మంత్రులు ఉంటారో లేదో తనకు తెలియదన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ బలమైన అభ్యర్థులనే బరిలోకి దింపబోతున్నామని, తమకు ఎక్కడా అభ్యర్థుల కొరత లేదన్నారు.



అప్ప వర్గీయులకే అగ్రస్థానం



- బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామకం

బెంగళూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కమిటీ ఎంపికలో అప్ప వర్గీయులకే అగ్రస్థానం దక్కింది. రాష్ట్రంలోని మొత్తం 39 రాజకీయ జిల్లాల పార్టీ అధ్యక్షులను బీజేపీ ప్రకటించింది. భోగి పండుగ రోజే ఈ జాబితాను పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర విడుదల చేశారు. ఈ జాబితాలో పార్టీ జాతీయ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప మద్దతుదార్లకే పెద్దపీట వేయడం విశేషం. బెంగళూరు ఉత్తర జిల్లా అధ్యక్షుడిగా ఎస్. హరీష్, బెంగళూరు సెంట్రల్ అధ్యక్షుడిగా సప్తగిరి గౌడ, బెంగళూరు ద క్షిణ అధ్యక్షుడిగా జయనగర్ ఎమ్మెల్యే సీకే రామమూర్తిని నియమించారు. ఇక కోలారు జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కేఎన్ వేణుగోపాల్, చిక్కబళ్లాపురం అధ్యక్షుడిగా రామలింగప్ప, బెంగళూరు గ్రామీణ అధ్యక్షుడిగా రామకృష్ణప్ప నియమితులయ్యారు. రాయచూరు అధ్యక్షుడిగా డాక్టర్ శివరాజ్ పాటిల్, కొప్పళ అధ్యక్షుడిగా నవీన్ గుళగణ్ణనవర్, బళ్లారి అధ్యక్షుడిగా అనిల్ కుమార్ మోకా, విజయనగర అధ్యక్షుడిగా చెన్న బసవనగౌడ పాటిల్, దావణగెరె అధ్యక్షుడిగా రాజశేఖర్, చిత్రదుర్గ అధ్యక్షుడిగా ఎ.మురళి, తుమకూరు అధ్యక్షుడిగా హెచ్ఎస్ ర విశంకర్, మధుగిరి అధ్యక్షుడిగా బీసీ హనుమంతెగౌడ, మైసూరు నగర అధ్యక్షుడిగా ఎల్.నాగేంద్ర, మైసూరు రూరల్ అధ్యక్షుడిగా ఎల్ఆర్ మహదేవస్వామి నియమితులయ్యారు. బెళగావి సిటీ అధ్యక్షురాలిగా గీతా సుతార్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్ష పదవి దక్కించుకున్న ఏకైక మహిళా నేత ఈమె ఒక్కరే కావడం విశేషం. నూతన అధ్యక్షులతో పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర వర్చువల్ సమావేశం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో 28 నియోజకవర్గాల్లో బీజేపిని గెలిపించి మోదీకి కానుక అందిద్దామని పిలుపునిచ్చారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

బెంగళూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజులు పాటు సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని కోరమంగలలో భోగి, సంక్రాంతి, కనుమ వేడుకలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ నాయకుడు ఆర్. వెంకటేశ్ నేతృత్వంలో సోమవారం కోరమంగల పాత గ్రామంలో వెయ్యి ఇళ్లకుపైగా ధాన్యం, రాగులు, చెరుకులు, రాగులు, అనప, చిలగడదుంప తదితర సామగ్రిని అందచేశారు. ధాన్యపురాశులను కొలువుదీర్చి పూజలు చేసిన అనంతరం ప్రజలకు పంపిణీ చేశారు. తొలుత గోపూజ చేశారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించగా మంత్రి రామలింగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మ్యూజికల్ చైర్స్, ఇతర పోటీలు కూడా కొనసాగాయి. ఇదే సందర్భంగా విజేతలకు ఫ్రిజ్, వాషింగ్‌మిషన్ ఇతరత్రా బహుమతులు ప్రదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే సౌమ్యరెడ్డి, మాజీ మేయర్ మంజునాథరెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఆడుగూడి మోహన్, మంజునాథ్ పాల్గొన్నారు.


ముగ్గుల పోటీలు వీక్షిస్తున్న మంత్రి రామలింగారెడ్డి


సంక్రాంతి సంబరాల్లో వర్తూరు తెలుగు సంఘం సభ్యులు తదితరులు

తెలుగు సంఘం ఆధ్వర్యంలో..

దొమ్మసంద్ర: స్థానిక దొమ్మసంద్రలో వర్తూరు తెలుగుసంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ ఘనంగా జరిగింది. సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. అన్ని వయసుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహదేవపుర నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముడి ప్రతిష్ఠాపన కార్యక్రమం నేపథ్యంలో స్థానికంగాను సంప్రదాయంగా పూజలు, ఇతర కార్యక్రమాలు సంబరంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్తూరు తెలుగు సంఘం అధ్యక్షుడు శ్రీకృష్ణ, కార్యదర్శి శివకుమారి, కోశాధికారి దివాకర్, మనోహర్‌రెడ్డి, వై లక్ష్మీప్రసాద్, కొడతి గ్రామపంచాయతీ సభ్యులు బాబురెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు వర్తూరు మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఏడుగురికి గాయాలు

- ఐదు ఇళ్లు ధ్వంసం



బెంగళూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని యలహంక లాల్‌బహదూర్ శాస్త్రి లే అవుట్‌లో వంటగ్యాస్ సిలిండర్ పేలిన దుర్ఘటనలో ఏడుగురు గాయపడగా ఐదు ఇళ్లు ధ్వంసమైన సంఘటన మం గళవారం ఉదయం చోటుచేసుకుంది. ఎల్‌పీజీ సిలిండర్ల పేలుడు ధాటికి చుట్టుపక్కల ఇళ్ల గోడలు బీటలువారి పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని పర్షియాబాను, సల్మా, షాహిద్, అస్మ, అఫ్రోజ్‌గా గుర్తించారు. వీరిలో కొందరి పరిస్థితి ప్రమాదకరంగా ఉన్న ట్టు తెలుస్తోంది. గాయపడ్డవారిని యలహంక ప్రభుత్వ ఆ సుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా ఉన్నవారిని విక్టోరియా ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి దుర్మరణం

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరులో వేర్వేరుగా జరిగిన నాలుగు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం పాలు కాగా పలువురు గాయపడ్డారు. దేవనహళ్లిలో సోమవారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న ముగ్గురిని బైక్ ఢీకొంది. ఈ ఘటనలో మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు నాగేశ్(27) మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తి కూడా గాయపడ్డంతో ఆసుపత్రికి తరలించారు. దేవనహళ్లిలోని భువనహళ్లి బ్రిడ్జి వద్ద మంగళవారం ఉదయం ప్రైవేట్ పాఠశాల బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీ కొనగా బండి నడుపుతున్న మనోజ్‌రెడ్డి (19) దుర్మరణం పాలయ్యాడు. ఇతడు యలహంకలోని కొండప్ప లే అవుట్‌కు చెందినవాడని, చిక్కబళ్లాపుర కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నట్టు పోలీసులు వెల్లడించారు. కళాశాలకు వెళ్తుండగా ఈ దారుణం సంభవించింది. దేవనహళ్లి ట్రాఫిక్ పోలీసులు ఈ రెండు ఘటనలకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కామాక్షిపాళ్య పోలీస్ స్టేషన్ పరిధిలో వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం హంప్‌పై నుంచి ఎగిరి కిందపడ్డంతో బండి నడుపుతున్న సంజయ్ (26) తీవ్రంగా గాయపడి మంగళవారం విక్టోరియా ఆసుపత్రిలో మృతి చెందాడు. మరో ఘటనలో వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో తండ్రీ, కుమార్తె మృతి చెందిన సంఘటన నెలమంగల జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. తుమకూరు జిల్లా బేళూరుకు చెందిన అమిత్ (38), అన్విత (5) మృతి చెందారు. వీరు బెంగళూరులోని మాగడి రోడ్డులో నివసిస్తున్నారు. బైక్‌పై ప్రయాణిస్తున్న అమిత్ భార్య కుసుమ తీవ్రంగా గాయపడ్డంతో ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి కూడా ప్రమాదకరంగా ఉందని పోలీసులు వెల్లడించారు. నెలమంగల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వేగంగా వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీకొన్న దుర్ఘటనలో ఫుడ్ డెలివరీ బాయ్ మృతి చెందిన సంఘటన మైసూరు రోడ్డు శాటిలైట్ బస్టాండ్ వద్ద సోమవారం అర్ధరాత్రి తర్వాత సంభవించింది. ఈ ఘటనలో మృతి చెందిన డెలివరీబాయ్‌ను బసవరాజ్‌గా గుర్తించారు. హెల్మెట్ ధరించినా కూడా బస్సు చక్రాల కిందపడి ఇతను మృతి చెందాడని పోలీసులు వెల్లడించారు.


అశేష జనసందోహం నడుమ ముందుకు సాగుతున్న రథం

ఘనంగా ఘాటి సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం

దొడ్డబళ్ళాపుర, జనవరి 16: తాలూకాలోని పురాణ ప్రసిద్ధిగాంచిన ఘాటి సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మరథోత్సవం మంగళవారం అశేష జన సందోహం నడుమ ఘనంగా నిర్వహించారు. ఏటా సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాన్ని వీక్షించేందుకు తాలూకా నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, గంధాభిషేకం, భస్మాభిషేకం అనంతరం పుష్పాలంకరణ చేశారు. రాత్రి 8.30 వరకు దర్శనానికి వీలు కల్పించారు. భక్తులకు అన్నదాసోహం, మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. కాగా 14 చోట్ల బైక్, కారు, బస్సులకు పార్కింగ్ వ్యవస్థ కల్పించారు. పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు. దొడ్డబళ్లాపుర, చిక్కబళ్లాపుర, బెంగళూరు, గౌరిబిదనూరు,

జాతరలో అపశృతి


రథోత్సవంలో భక్తుల తోపులాటలో పలువురు గాయపడ్డారు. రథం లాగేవేళ భక్తుల తోపులాట జరిగింది. రథం చక్రాల సమీపాన పడిన భక్తులను డీఎస్పీ రవి, పాత్రికేయుడు శివరాజ్ రక్షించారు. కాగా విశ్వేరయ్య పికప్‌డ్యామ్ సమీపాన బస్సు రివర్స్ వస్తుండగా ఒక భక్తుడు చక్రాలకింద పడి మృతి చెందాడు. తొలుత కాలికి తీవ్ర గాయాలు కాగా అతడిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. దొడ్డబళ్లాపుర రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ఆదాయంలో గ్రామాలకు వాటా

- పంచాయతీలకు 25 శాతం నిధులు
- ఆ నిధులతో మౌలిక వసతుల కల్పన

బెంగళూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఇసుక ఆదాయంలో ఇకపై గ్రామాలకు కూడా వాటా లభించనుంది. ఈ మేరకు భూగర్భగనులశాఖ ఉన్నతాధికారి చిదంబర్ నగరంలో మంగళవారం మీడియాకు తెలిపారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలకు ఇకపై ఇసుక తవ్వకాలలో లభించే ఆదాయంలో 25 శాతాన్ని నేరుగాను, ఇసుక తవ్వకాల పరిధిలోని తాలూకాలలోని గ్రామ పంచాయతీలకు 25శాతం నిధులను అందచేయనున్నారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వరకు నదీ పరీవాహక ప్రాంతాల్లో జరిగిన ఇసుక తవ్వకాల ఆదాయాన్ని నేరుగా గ్రామపంచాయతీలకు పంపిణీ చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఈ అవధిలో 8.99 మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలు జరిగాయని ఫలితంగా రూ. 719.43 లక్షల ఆదాయం లభించిందన్నారు. వీటిలో ఇసుక తవ్వకాల పరిధిలోని గ్రామ పంచాయతీలకు రూ.179.83 లక్షలు, ఇసుక తవ్వకాల పరిధిలోని తాలూకాలలోని గ్రామపంచాయతీలకు రూ.179.83 లక్షలను అందచేయనున్నారు. ఇందుకోసం నిధులు విడుదల చేశామన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా ఇసుక తవ్వకాలు అధికంగా జరిగే గదగ్, హావేరి, బాగల్కోట, దావణగెరె, చిత్రదుర్గ, శివమొగ్గ, చామరాజనగర, హాసన్, దక్షిణకన్నడ, ఉడుపి, కొడగు, చిక్కమగళూరు, కలబురగి, రాయచూరు, బళ్లారి, విజయనగర, యాదగిరి, కొప్పళ, బెళగావి, ఉత్తరకన్నడ జిల్లాల్లోని 59 తాలూకాలలోని గ్రామాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ నిధులతో ఆయా గ్రామాలలో శుద్ధ తాగునీరు, రహదారులు, మరుగుదొడ్లు, పాఠశాలల నిర్మాణం వంటి పనులు చేపడతామన్నారు. ఇకపై ప్రతి ఏటా ఇసుక ఆదాయంలో గ్రామపంచాయతీల వాటా విధానాన్ని కొనసాగిస్తామన్నారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.93	1,621.41
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	9,940
సామర్థ్యం (టీఎంసీలు)	10.15	65.37

ఘనంగా సిద్దరామేశ్వర్ జయంతి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

సిరుగుప్ప, జనవరి 16: ఆరు వేల వచనాలు రచించిన మహాపురుషుడు సిద్దరామేశ్వరుడని తహసీల్దార్ విశ్వనాథ్ తెలిపారు. సిరుగుప్ప పట్టణంలో తాలూకా పరిపాలన, ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 852వ సిద్దరామేశ్వర జయంతి వేడుకలను నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగరంలోని హైస్కూల్ నుంచి నేతాజి వ్యాయామశాల వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జ్యోతి వెలిగించి ఆయన మాట్లాడారు. సిద్దరామేశ్వర వెనుకబడిన వర్గాల మార్పుకు కృషి చే శారన్నారు. తత్వసిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ పాటించి అభివృద్ధి బాటలో నడవాలని సూచించారు. ఈఓ పవన్ కుమార్, ఎస్సీ సంక్షేమ శాఖ డైరెక్టర్ రాజేశ్వరీ, భోవి సమాజం తాలూకా అధ్యక్షుడు గాళప్ప, ప్రముఖులు పెద్ద ఉలిగప్ప, నటరాజ, తిమ్మయ్య, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మారథోత్సవం



గ్రామవీధుల్లో సాగుతున్న బ్రహ్మారథోత్సవం

పావగడ, జనవరి 16: భక్తులు కొంగు బంగారంగా కొలిచే నాగలమడక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం మంగళవారం నాగలమడకలో వేలాదిమంది భక్తుల నడుమ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు సరిగ్గా ఉత్సవ విగ్రహాలను అలంకృత రథంపై ఉంచి దేవాదాయ శాఖ అధికారి వరదరాజు, ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్, అధికారులు రథాన్నిలాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. బ్రహ్మరథోత్సవం ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి పురవీధుల్లో సాగుతుండగా భక్తులు అరటికాయలు, సాంబ్రాణి రథంపై విసిరి గోవింద నామ స్మరణతో మొక్కుబడిని తీర్చుకొన్నారు.

ఆవిష్కరణకు నోచుకోని విగ్రహం



బుడాపార్కులో విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన కంచె

బళ్లారి గాంధీనగర్, జనవరి 16: బళ్లారి నగరంలోని ఆర్టీసి బస్టాండు సమీపంలోని జోళదరాసి దొడ్డనగౌడ మందిరం, బుడా పార్కులో ఏర్పాటు చేసిన సంగొళ్ళి రాయణ్ణ విగ్రహం ఇంకా ప్లాస్టిక్ కవర్లలోనే బందీగా ఉండడంతో నగరప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుడా పార్కులో ఓ మూలన ఏర్పాటు చేసిన విగ్రహం వైపు... అటువైపు వెళ్ళే ప్రతి ఒక్కరు ఆశ్చర్యంగా చూస్తూ వెళుతున్నారు. కర్ణాటక శాసనసభ ఎన్నికలకు ముందు ఏర్పాటు ఏసిన సంగొళ్ళి రాయణ్ణ కాంశ్య ప్రతిమకు ఏర్పాటుకు సుమారు రూ.3.50లక్షలు వెచ్చించినట్లు తెలిసింది. విగ్రహం ఏర్పాటై 8నెలలు గడుస్తున్నా... ఆవిష్కరణకు నోచుకోకపోవడంతో సంగొళ్ళి రాయణ్ణ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంగొళ్ళి రాయణ్ణ విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతుల మీదుగా ఆవిష్కరించాలని అభిమానులు ఎదురు చూస్తున్నారు

అయోధ్యలో హొసపేట రామాయణం!



రామాయణ నాటకాన్ని ప్రదర్శిస్తున్న హొస పేట బయలునాటక కళాకారులు

బళ్లారి గాంధీనగర్, జనవరి 16: అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా వివిధ ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా హొసపేట నగరానికి చెందిన సంపూర్ణ రాయాయణ బయలాట బృందం మూడు రోజుల పాటు అయోధ్యలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి.. కర్ణాటక కళా సంస్కృతికి వన్నెతెచ్చారు. ప్రస్తుతం అయోధ్యలో భారీగా చలిగాలులు వీస్తున్నాయి. అయినా హొసపేటకు చెందిన జానపద కళాకారులు రామాయణనాటకం ప్రదర్శించి ప్రజల మనస్సులను దోచుకున్నారు. బుధవారం నాల్గవ ప్రదర్శన ఇచ్చి తిరిగి రాష్ట్రానికి రానున్నారు. అయోధ్యలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పలు కళాబృందాలు పాల్గొంటున్నాయి. కర్ణాటక రాష్ట్రం నుంచి బయలాట బృందానికి మాత్రమే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అవకాశం లభించడం విశేషం. ఈ కళాబృందంలో 12మంది కళాకారులుండగా, నలుగురు సహకళాకారులు ఉన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు ఒకే ఒక్క వేదిక మాత్రమే ఏర్పాటు చేసినా అక్కడ అవకాశం హొసపేట కళాకారులకు రావడం ప్రత్యేకం.

చేనేత మేళాకు అపూర్వ స్పందన

హ్యాండ్‌లూమ్ డైరక్టర్ విరూపాక్షప్ప

బళ్లారి సిటీ, జనవరి 16: నగరంలోని గాంధీభవనంలో రాష్ట్రస్థాయి చేనేత వస్త్రమేళాకు వినియోగదారుల నుంచి మంచి స్పందన వచ్చిందని



హావేరి హ్యాండ్‌లూమ్ డైరెక్టర్ విరూపాక్షప్పను సత్కరిస్తున్న దృశ్యం

కావేరీ హ్యాండ్‌లూమ్ డైరెక్టర్ విరూపాక్షప్ప తెలిపారు. మేళా ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కోవిడ్ సందర్భంగా ఎక్కడ మేళాను నిర్వహించలేదని, ఈ సంవత్సరం మైసూర్‌లో మాత్రం ఎగ్జిబిషన్‌ను నిర్వహించినప్పటికీ ఈరకమైన స్పందన రాలేదన్నారు. ఇప్పుడు బళ్లారిలో నిర్వహించిన మేళాకు కస్టమర్ల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ఆరు నెలలకు ఒకసారి ఇలాంటి ప్రదర్శనను నిర్వహించాలనే ఆలోచన ఉందన్నారు. భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళా సందర్భంగా కాశ్మీర్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ మొదలైన రాష్ట్రాల నుంచి ఏర్పాటయిన 60 దుకాణాలలో పత్తి, పట్టువస్త్రాలు, గుడారా, ఖనత, శాలువా తదితరాలను విక్రయించారన్నారు. ఇలకల్లు, మొలకాల్మూరుచీర, టెక్కలకోట గుడారం, హావేరికి చెందిన తుమ్మేనగట్టి చొక్కా, సండూర్ కరకుశల కేంద్రానికి చెందిన వెదురు వస్తువులు, జమ్ముకాశ్మీర్‌లోని ఉన్నిశాలువలు వినియోగదారుల దృష్టిని ఆకర్షించాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 20శాతం తగ్గింపు ఇవ్వడంతో సంక్రాంతి పండుగలో మంచి వ్యాపారం జరిగిందని, ఇప్పటి వరకు రూ.కోటి రూపాయలకు పైగా లావాదేవీలు జరిగాయన్నారు. దీంతో నేత కార్మికులు సంతోషం వ్యక్తం చేశారన్నారు. 15రోజుల పాటు జరిగిన ఈ ఎగ్జిబిషన్ అండ్ సేల్స్ ఫెయిర్ చేనేత కార్మికులకు, వినియోగదారులకు ఉపయోగపడిందన్నారు.

రూ.2 కోట్లతో భోవి కమ్యూనిటీ హాల్

మంత్రి నాగేంద్ర

బళ్లారి సిటీ, జనవరి 16: జిల్లాలో అన్ని వసతులతో కూడిన భోవి కమ్యూనిటీహాల్‌ను రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తామని బళ్లారి ఇన్‌చార్జిమంత్రి బి.నాగేంద్ర తెలిపారు. నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని రాఘవ కళామందిరంలో జిల్లాపరిపాలన, కన్నడ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 852వ శివయోగి సిద్దరామేశ్వర జయంతోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివయోగి చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.2 కోట్ల వ్యయంతో భోవిసంఘ భవనం నిర్మిస్తామన్నారు. ఇందుకోసం బళ్లారి నగరంలో ఎక్కడైనా స్థలం గుర్తిస్తే భూమిపూజకు వ్యక్తిగతంగా తాను రూ.10 లక్షలు ఇస్తానన్నారు. భోవిసంఘం విద్యాపరంగా, రాజకీయంగా, ఆర్థికంగా బలపడాలని సూచించారు. ఎవరైనా రాయి, మట్టి, సిమెంట్‌తో ఇళ్ళు కట్టుకుంటారని, వీరు మన పూర్వకాలపు ఇంజనీర్లు కావడంవలన కేవలం తమ టెక్నిక్‌తోనే ఇంటిని అందంగా నిర్మించేందుకు కృషిచేస్తారన్నారు.

కన్నడ సాహిత్య పరిషత్ జిల్లాధ్యక్షుడు నిష్టిరుద్రప్ప మాట్లాడుతూ సాధువుల ఆలోచనలు, సాధించిన విజయాలను ప్రతిఒక్కరూ అనుకరించే దృక్పథం కలిగి ఉండాలన్నారు. శివయోగి సిద్దరామేశ్వర్ 68వేల పద్యాలను



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, డీసీ

స్వరపరిచి గానం చేశారు. వాటిలో ఇప్పుడు 1,679 వచనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాపోలీస్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్, కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు,మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శ్వేత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జయంతిలో భాగంగా అంతకుముందు నగరంలోని కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణలో శివయోగి సిద్దరామేశ్వర చిత్రపటానికి మహానగర కార్పోరేషన్ మేయర్ శ్వేత పూలమాలలు వేసి శోభాయాత్రను ప్రారంభించారు. డోలు, తాషే తదితర వాయిద్యాలతో కనకదుర్గమ్మ దేవాలయం నుంచి ప్రారంభమైన జయంతి ఊరేగింపు గడిగి చెన్నప్ప సర్కిల్ మీదుగా రాఘవ కళా మందిరం వేదిక హాల్‌కు చేరుకుంది.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు: మంత్రి

రాయచూరు జనవరి 16 : వర్షభావ పరిస్థితి వల్ల వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ అధికారులకు సూచించారు. నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దాదాపు 6 సంవత్సరాల అనంతరం ప్రత్యేకంగా రెవెన్యూ శాఖ పైనే ప్రగతి పరిశీలన సమావేశం నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి మాట్లాడిన మంత్రి, రెవెన్యూ శాఖ పాలనాపరంగా ఇతర అన్ని శాఖలకు మాతృ సంస్థ వంటిదని ఈ శాఖలో పని చేసే అధికారులు మరింత బాధ్యతయుతంగా, నిబద్ధతతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే రెవెన్యూ శాఖ అధికారుల పనితీరుపైనే ఆధారపడి ఉంటుందన్నారు. వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అందుబాటులో ఉన్న ప్రైవేటు బోరుబావి యజమానులతో తగిన ఒప్పందాలు చేసుకోవాలన్నారు. అదే సమయంలో పంటనష్టం పోయిన రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాయచూరులో 1.36లక్షల రైతుల పేర్లను నమోదు చేయాలన్నారు. సమావేశం లో చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసరాజు, సింధనూరు, రాయచూరు రూరల్ ఎమ్మెల్యేలు బాదర్లి హంపనగౌడ, దద్దల బసనగౌడలు తాగునీటి సమస్య గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు.



అధికారులతో సమావేశమైన రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణ బైరేగౌడ

28న ఆర్మ్‌డ్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్ష



ఎస్పీ రంజిత్‌కుమార్

బళ్లారి సిటీ, జనవరి 16: 2022-23 సంవత్సరానికిగాను మిగిలిన 3064 ఆర్మ్‌డ్ పోలీస్ కానిస్టేబుల్ (సీఏఆర్/డీఏఆర్)పోస్టుల భర్తీకి ఈ నెల 28నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లాపోలీస్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ బండారు తెలిపారు. నగరంలోని 16 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12-30గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. బాలభారతి పాఠశాల, ఇండిపెండెంట్ పీయూ కాలేజ్, శెట్టర్ గురుశాంతప్ప పీయూ కాలేజ్, రావ్ బహద్దూర్ మహాబలేశ్వరప్ప ఇంజినీరింగ్ కాలేజ్, సరళదేవి కళాశాల తదితర కేంద్రాల్లో పరీక్షలు గట్టి బందోబస్తుతో నిర్వహిస్తారన్నారు. అర్హత గల అభ్యర్థులు తప్పనిసరిగా వెబ్‌సైట్ నుంచి రాతపరీక్షకు సంబంధించిన అడ్మిట్‌కార్డులను పొందాలని, పరీక్షల్లో ఏదైనా గుర్తింపు కార్డును సమర్పించాలన్నారు. పరీక్షాకేంద్రాల్లో ఎలాక్ట్రానిక్ పరికరాలను నిషేధిస్తున్నట్లు ఆయన ప్రకటనలో తెలిపారు.

బిస్కెట్ ఫ్యాక్టరీలో పేలిన బాయిలర్



పేలుడు ధాటికి చెల్లాచెదురైన ఫ్యాక్టరీ లోపలి భాగం. ఇన్‌సెట్‌లో మృతుడు సలీం

బళ్లారి గాంధీనగర్, జనవరి 16: నగరంలోని గుగ్గరహట్టి ప్రాంతంలో ఉన్న భారత్ బిస్కెట్, బ్రెడ్ తయారు చేసే ఫ్యాక్టరీలో ఆదివారం రాత్రి జరిగిన బాయిలర్ పేలుడు ఘటనలో ఫ్యాక్టరీలో పనిచేసే ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో ఐదుగురు తీవ్రంగా గాయపడడంతో వారిని స్థానిక విమ్స్‌కు తరలించారు. సలీం అనే కార్మికుడు ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. గాయపడిన ఐదుగురిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. బ్రెడ్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలియ రాలేదు. ఘటన ఆదివారం రాత్రి జరగడంతో వరుసగా సంక్రాంతి సెలవులు రావడంతో బాయిలర్స్ అండ్ సేఫ్టీ అధికారులు అధికారులు అందుబాటులోకి రాలేదు. దీంతో ప్రమాదా నికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు బళ్ళారి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పర్యవేక్షించారు. గాయపడిన నలుగురు బళ్ళారి విమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు బళ్ళారి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిమళించిన మానవత్వం

● ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెమలికి చికిత్స



తారానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న నెమలి

బళ్లారి గాంధీనగర్, జనవరి 16: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సామాన్య ప్రజలకు చికిత్స చేయడం సర్వసాధారణం. అయితే అడవిలో గాయపడిన నెమలికి చికిత్సను అందించి మానవీయతను చాటుకున్నారు ప్రభుత్వ వైద్యులు. వారికి పశువైద్యం తెలియకపోయినా, వన్యజీవులపట్ల ప్రేమతో మయూరానికి చికిత్స అందించారు. సండూరుతాలూకా తారానగర్ అటవీ ప్రాంతంలో గాయపడి పైకి ఎగరలేని స్థితిలో పడివున్న నెమలిని అటవీశాఖ సిబ్బంది ఒకరు మంగళవారం సమీపంలోని తారానగర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. నడవలేని, ఎగరలేని స్థితిలో ఉన్న నెమలికి అవసరమైన చికిత్సను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సునీతా, డాక్టర్ హరీష్ దానిని చూసి జాలిపడి చికిత్స అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.రమేష్ బాబు మాట్లాడుతూ, సండూరు తాలూకా పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతాలు ఉండడంతో పక్షులు, జంతువులు అక్కడే తిరుగుతూ రోడ్డు దాటుతుంటాయి. అలాంటి సమయంలో రోడ్డుపై వెళ్ళే వాహనాలు నిదానంగా నడపడం ద్వారా అటవీ జంతువుల, పక్షుల, ప్రాణాలను కాపాడవచ్చని ఆయన పేర్కొన్నారు. సాధారణంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పశువులకు, పక్షులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండవని, అయితే సమీపంలోని సండూరు పశువైద్యాధికారుల నుంచి మందులు తెప్పించుకుని గాయపడిన నెమలికి చికిత్స అందించినట్లు అటవీశాఖ అధికారి రాము తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

● రాయచూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్

రాయచూరు జనవరి 16 : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాయచూరు స్థానంలో బీజేపీ అభ్యర్థి గెలవడం ఖాయమని రాయచూరు సిటీఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివరాజ్ పాటిల్ అన్నారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వంపట్ల పూర్తి విశ్వాసంతో ఉన్నారని మరోసారి నరేంద్ర మోదీని ప్రధాన మంత్రిగా చేసేందుకు ఇప్పటికే ప్రజలు సిద్ధమయ్యారని విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా తనపై విశ్వాసంతో అప్పగించిన పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలను సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ముఖ్య నేతల సహకారంతో పరిపూర్ణంగా నిర్వహిస్తానన్నారు. కాగా ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ మందిర ప్రారంభం నేపథ్యంలో ప్రజలు అన్ని దేవాలయాల వద్ద పూజలు నిర్వహించి శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు.

హొసూరు జోన్

కనుమ పండుగనాడు గోమాతకు పూజలు



గోమాతను పూజిస్తున్న భక్తులు

హొసూరు జనవరి 16 : సంక్రాంతి తర్వాత వచ్చే కనుమ పండుగ నాడు గోవులను పూజించడం ఆనవాయితీ. తమిళులు మాడుపొంగలి గా దీన్ని జరుపుకుంటారు. మొత్తం నాలుగు రోజులు పాటు ఈ పండుగను తమిళుల ఉత్సాహంగా జరుపుకుంటారు. హొసూరు సమీపంలోని మోర్నపల్లి గ్రామంల్లో వెలసిన ప్రత్యంగిరా దేవి ఆలయంలో గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆవులను చెరువులో కడిగిన తర్వాత ఆవు కొమ్ములకు రంగులు పూసి దండాలు వేసి రంగురంగుల దుస్తులు వేసి సూర్యునికి పూజలు చేస్తారు. ఆ తర్వాత ఎద్దులను జల్లికట్టుకు వదలి ఎద్దులను లొంగ తీసుకుంటారు, ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు కూడా అందిస్తారు, ఇది తమిళనాడుల్లో వైభవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా హొసూరు ప్రత్యంగిరా దేవి ఆలయంలో గోమాతను మహాలక్ష్మి అంశంగా పూజించి పసుపు, గంధం, కుంకుమలతో అలంకరించి పూజలు నిర్వహించారు, అనంతరం ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణ చేసి మూలవిరాట్ ప్రత్యంగిరా దేవి సన్నిధిలో గోవుకు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు, గోవుకు లక్ష్మి కుబేర పూజచేసి నాణేలతో అభిషేకాలు నిర్వహించారు, అధిక సంఖ్యల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

రైతు బజారులో రికార్డు స్థాయి అమ్మకాలు

హొసూరు (మత్తిగిరి) జనవరి 16 : సంక్రాంతి సందర్భంగా హొసూరు రైతు బజారులో 200కు పైగా కూరగాయల దుకాణాలను ఏర్పాటు చేశారు, ఇందులో హొసూరు పరిసర ప్రాంతాల్లో పండే కూరగాయలు, పండ్లను అమ్మకానికి తీసుకువచ్చారు. పొంగల్ పండుగ సందర్భంగా హొసూరు రైతు బజారులో విక్రయాలు జోరుగా సాగాయి. ప్రజలు పండ్లు, చెరకులు, గుమ్మడి, పసుపు, వేరుశనగలు భారీగా కొనుగోలు చేశారు, మధ్యాహ్నం 3 గంటల వరకు జనం గుమిగూడడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది, ఉదయం నుంచి సాయంత్రం వరకు 20 వేల మందికి పైగా వినియోగదారులు రైతు బజారుకు వచ్చి వెళ్లారు, ఈ సందర్భంగా సోమవారం సంక్రాంతి కావడంతో 14 వ తేది నుంచే కొనుగోళ్లు జోరుగా సాగాయి. సుమారు రూ.50 లక్షల వ్యాపారం జరిగింది, గత ఏడాది కంటే ఈ సంవత్సరం విక్రయాలు ఎక్కువగా సాగాయి. సంక్రాంతి సందర్భంగా రైతు బజారులో వ్యాపారం భారీగా జరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా తిరువళ్లువర్ దినోత్సవం

హొసూరు (కృష్ణగిరి) జనవరి 16 : కృష్ణగిరి జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం తిరువళ్లువర్ దినోత్సవాన్ని జిల్లా కలెక్టర్ సరయు ఆధ్వర్యంలో నిర్వహించారు. తిరువళ్లువర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు, అందరికి స్వీట్లు పంచి పెట్టి తిరుకురళ్ పుస్తకావిష్కరణ చేశారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ విజయ కుమార్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ కుమరేషన్, కృష్ణగిరి జిల్లా తిరువళ్లువర్ సంఘ అధ్యక్షుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తిరువళ్లువర్ విగ్రహానికి నివాళులర్పించిన కలెక్టర్

ప్రజల సహకారంతోనే అభివృద్ధి

● చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్ఎస్ భోసరాజు



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి భోసరాజు

రాయచూరు జనవరి 16 : ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపట్టినా అందులో ప్రజలు పూర్తిగా భాగస్వాములైనప్పుడే అభివృద్ధి పరుగులు పెడుతుందని రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్. భోసరాజు అన్నారు. రూ.3 కోట్ల వ్యయంతో ఆధునీకరించిన నగరంలోని పండిత్ సాద్ధరామ్ జంబలదిన్ని రంగమందిరాన్ని సోమవారం మంత్రి భోసరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి, కేకేఆర్‌డీబీ (కల్యాణ కర్ణాటక రీజనల్ డెవలప్‌మెంట్ బోర్డ్) ద్వారా రూ.3 కోట్ల వ్యయంతో రంగమందిరాన్ని అన్ని హంగులతో పూర్తిగా ఆధునీకరించినట్లు తెలిపారు. ఇది ముమ్మాటికి ప్రజల ఆస్తి అని దీన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కవులు, కళాకారులు, అధికారులు ఇతరత్రా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే వారికి అన్ని విధాల అనుకూలంగా ఉండేందుకు రంగమందిరాన్ని తీర్చి దిద్దామన్నారు.

పబ్లిక్ స్థలం కబ్జాపై ప్రజా సంఘాల ఆగ్రహం

రాయచూరు జనవరి 16 : నగరంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో పబ్లిక్ అవసరాల కోసం ఉద్దేశించిన స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రంగమందిరం ప్రారంభోత్సవానికి వచ్చిన రాష్ట్ర చిన్ననీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజుని మంగళవారం అకస్మాత్తుగా అడ్డుకున్న ప్రజా సంఘాల నాయకులు స్థలం కబ్జా పై ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 384/1లో 1037 అడుగుల చదరపు గజాల స్థలం పాఠశాల కోసం ఉద్దేశించినట్లు తెలిపారు. ఈ స్థలం ఖాళీగా ఉండడాన్ని గుర్తించిన కొంతమంది తాత్కాలిక షెడ్లు వేసి ఆలయం పేరుతో కబ్జా చేసేందుకుయత్నిస్తున్నట్లు ఆరోపించారు. వెంటనే స్థలాన్ని ఖాళీచేయించి పాఠశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు మంత్రిని కోరారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

శ్రీకృష్ణదేవరాయలు (జయంతి)



విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు 1471 జనవరి 17న జన్మించారు. ఆయన పాలనలో విజయనగర సామ్రాజ్యం అత్యున్నతస్థితికి చేరుకుంది. దేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తులలు ఒకరిగా తెలుగు, కన్నడ ప్రజలు ఆయనను అభిమానిస్తారు. సాహిత్యంలో ఆంధ్రభోజుడిగా, కన్నడ రాజ్య రమా రమణగా కీర్తించబడ్డారు. తెలుగులో ఆముక్తమాల్యద గ్రంథాన్ని రచించారు. కవి, పండితుడు కావడంతో సాహితీ సమరాంగణ సార్వభౌముడు అని బిరుదు పొందారు. భువనవిజయంలో ఎనిమిది మంది కవులు అష్టదిగ్గజములుగా పేరొందారు. గొప్ప రాజనీతిజ్ఞుడు, ఆర్థికవేత్త, కవిపోషకుడిగా రాణించారు. 1529 అక్టోబరు 17న కన్నుమూశారు.

ఎల్‌వీ ప్రసాద్ (జయంతి)



ఎల్‌వీ ప్రసాద్‌గా పేరొందిన అక్కినేని లక్ష్మీ వరప్రసాద్ రావు 1908 జనవరి 17న ఏలూరు తాలూకా సోమ వరప్పాడు గ్రామంలో జన్మించారు. తెలుగు సినీ నిర్మాత, దర్శకుడు, నటుడు. హిందీ, తమిళ, తెలుగు, కన్నడ భాషలలో 50వరకు సినిమాలకు దర్శకుడిగా, నిర్మాతగా వ్యవహరించారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత. హిందీ, తమిళ, తెలుగు భాషలలో తొలి టాకీ చిత్రాలైన ఆలం ఆరా, కాళిదాసు, భక్త ప్రహ్లాద సినిమాలలో నటించిన ఘనత ఆయనది. హైదరాబాద్‌లో 1987లో లాభాపేక్ష లేని కంటి ఆసుపత్రి నెలకొల్పబడింది. ఇందుకుగాను 5 ఎకరాల స్థలం, ఇంకా భారీగా నగదు సమకూర్చడంతో ఆయన త్యాగానికి గుర్తుగా ఆసుపత్రికి ఆయన పేరును పెట్టారు. 1994 జూన్ 22న కన్నుమూశారు.

చాగంటి సోమయాజులు (జయంతి)



'చాసో'గా చిరపరిచితులైన చాగంటి సోమయాజులు 1915 జనవరి 17న శ్రీకాకుళంలో జన్మించారు. ఆయన తొలి రచన 'చిన్నాజీ' 1942లో భారతి అనే పత్రికలో ప్రచురితమైంది. ఆ తర్వాత ఎన్నో కథలు, కవితలు రాశారు. ఆయన రచనల్లో ఎక్కువగా పీడిత ప్రజల బాధలు, సమస్యలు ప్రధానంగా ఉండేవి. చాలా కథలు, హిందీ, రష్యన్, కన్నడ, మరాఠీ, మళయాళం, ఉర్దూ భాషలలోకి అనువదించబడ్డాయి. 1968లో చా సో కథలుగా కథా సంకలనం వెలువడింది. కొండే పూ జి సాహితీ సత్కారం అందుకున్నారు. 1994 జన వరి 1న కన్నుమూశారు. మరణానంతరం ఆయన భౌతిక కాయాన్ని మెడికల్ కాలేజీకి పరిశోధనల నిమిత్తం ఇవ్వని కోరడం ఆయన అభ్యుదయ జీవన దృక్పథానికి నిదర్శనం.

ఎంజీఆర్ (జయంతి)



ఎంజీఆర్‌గా పేరొందిన మరుతూరు గోపాల రామచంద్రన్ 1917 జనవరి 17న జన్మించారు. తమిళ చలనచిత్ర నటుడు, రాజకీయ నాయకుడు. 1977- 87ల మధ్య పదేళ్లపాటు తమిళ నాడు ముఖ్యమంత్రిగా వ్యవ హరించారు. గొప్పదాత, సమాజ సేవకుడు. డీఎంకేలో చేరి పలు హోదాలలో కొనసాగారు. కాలక్రమంలో అన్నాదురై మరణానంతరం మిత్రుడు కరుణానిధిలో రాజకీయ విరోధం నెలకొని సొంతంగా అన్నాడీఎంకే పార్టీని స్థాపించారు. అనంతరం విజయం సాధించి ముఖ్యమంత్రిగా కొనసాగారు. 1987 డిసెంబరు 24న కన్నుమూశారు. మరణానంతరం భారతరత్న ప్రకటించారు.

మొహ్మద్ అలీ (జయంతి)



ప్రపంచప్రఖ్యాత బాక్సర్ మొహ్మద్ అలీ 1942 జనవరి 17న అమెరికా దేశం కెంటకీ ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు కాసియస్ మార్సెలస్ క్లే జూనియర్. 12వ యేటనుంచి బాక్సింగ్‌లో శిక్షణ పొందారు. 1960లో బంగారుపతకం సాధించారు. తర్వాత ప్రొఫె షనల్‌గా 21 సంవత్సరాలపాటు బాక్సింగ్‌లో తిరుగు లేని విజయాలను సాధించారు. 1964లో ఇస్లాం మతం స్వీకరించి మొహ్మద్‌అలీగా పేరు మార్చు కున్నారు. అ ప్పట్లో సైన్యం చేరి వియత్నాంపై యుద్ధం చేయాల్సి ఉండగా తాను నమ్మిన ఇస్లాం ప్రకారం అమా యకులను చంపనీయదని సైన్యంలో చేరేందుకు ని రాకరించాడు. దీంతో అమెరికా ప్రభుత్వం అతడి హెవీ వెయిట్ టైటిల్స్‌ను రద్దు చేసి జైలుకు పంపింది. చివర కు కోర్టును ఆశ్రయించడంతో అతడికి అనుకూలంగా తీర్పు వచ్చింది. 2016 జూన్ 3న మరణించారు.

జ్యోతిబసు (వర్ధంతి)



పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా వ్యవ హరించి దేశంలో అత్యధికకాలం సీఎంగా కొనసాగిన రికార్డుల నెలకొల్పిన జ్యోతిబసు 1914 జూలై 8న కోల్కత్తాలో జన్మించారు. కమ్యూనిస్టు (మార్కిస్ట్) పార్టీకి చెందిన జ్యోతిబసు 1977 నుంచి వరుసగా ఐదుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. అంతకు ముందు ఉపముఖ్యమంత్రిగా కొనసాగారు. సీపీఎం పొలిట్‌బ్యూరో నిర్ణయం వల్ల 1996లో ప్రధాని అయ్యే అవకాశం కోల్పోయారు. 2010 జనవరి 17న ఆయన కన్నుమూశారు.

వైభవంగా సుబ్రహ్మణ్య రథోత్సవం

ధర్మవరం, జనవరి 16: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా స్థానిక ఎస్ఎల్‌వీ మార్కెట్‌లోని ఆలయంలో రథోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా జరిగాయి. అర్చకులు విజయ్‌కుమార్‌శర్మ శిష్య బృందం శ్రీవల్లి దేవసేన సహిత స్వామివారి విగ్రహాలకు వివిధ పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్వసూక్త అభిషేకం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం వెండి కవచ సమర్పణ సేవను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను రథంలో ఉంచి ప్రధాన వీధులగుండా ఊరేగించారు. రథోత్సవంలో అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పోరాళ్లపుల్లయ్య శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనలను, భజనలు, కోలాటం కార్యక్రమాలను నిర్వహించారు.

లోక్‌సభ టికెట్లు ఎవరికి దక్కేనో..?

- మహిళలను బరిలోకి దించే యోచనలో కాంగ్రెస్
- బీజేపీ సిట్టింగ్‌లలో గుబులు



ఎంపీలు డీవీ సదానందగౌడ, పీసీ మోహన్, తేజస్వీసూర్య

బెంగళూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు నగరంలోని మొత్తం మూడు లోక్‌సభా నియోజకవర్గాలలో ఎవరు బరిలో ఉంటారనే అంశంపై రాజకీయ వర్గాల్లో కుతూహలకరమైన చర్చలు జరుగుతున్నాయి. బెంగళూరు దక్షిణ, బెంగళూరు ఉత్తర, బెంగళూరు సెంట్రల లోకసభా నియోజకవర్గాలను 2019 ఎన్నికల్లో బీజేపీ కైవశం చేసుకుంది. ఈసారి సిట్టింగ్‌లను మార్చే అవకాశం ఉందని కథనాలు ప్రచారంలో ఉన్నాయి. బెంగళూరు దక్షిణ నుంచి పార్టీ సిట్టింగ్ ఎంపీ తేజస్వి సూర్య పేరు ఒక్కటే ప్రస్తుతానికి పక్కాగా ఉందని మిగిలిన రెండు నియోజకవర్గాల విషయంలో బీజేపీలో డోలాయమాన పరిస్థితి నెలకొని ఉంది. ఎన్నికల రాజకీయాల నుంచి తప్పుకోనున్నట్లు ఇటీవల ప్రకటించిన బెంగళూరు ఉత్తర ఎంపీ, మాజీ ముఖ్యమంత్రి డీవీ సదానందగౌడ తాజాగా మనసు మార్చుకుని మళ్లీ పోటీకి సై అంటుండటంతో కుతూహలం నెలకొని ఉంది. ఆయనకే టికెట్ ఇవ్వాలా? అభ్యర్థిని మార్చాలా అనే అంశంపై బీజేపీ ఎటూ తేల్చుకోలేకపోతోంది. బెంగళూరు సెంట్రల్ విషయంలోనూ ఇదే పరిస్థితి ఉన్నా సిట్టింగ్ ఎంపీ పీసీ మోహన్ విషయంలో మాత్రం పార్టీ నేతలు ఒకింత సుముఖంగా ఉన్నట్లు సమాచారం. వివాదాలకు దూరంగా ఉంటూ రాష్ట్ర పార్టీలో సీనియర్ నేతలందరితోనూ, అధిష్ఠానం పెద్దలతోనూ మోహన్ సత్సంబంధాలను కలిగి ఉండటం ఆయనకు ప్లస్ పాయింట్ కానుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఒక వేళ డీవీ సదానందగౌడ విషయంలోనూ పార్టీ తన మనసు మార్చుకుంటూ ఈ మూడింటా దాదాపుగా సిట్టింగ్‌లే మళ్లీ బరిలోకి దిగే అవకాశం ఉంది.

కాంగ్రెస్ తరపున బరిలోకి మహిళలు?

కాగా ఈసారి బెంగళూరులో ఎలాగైనా ఖాతా తెరవాలని గట్టిపట్టుతో ఉన్న కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పావులను కదుపుతోంది. మైనార్టీల ప్రాబల్యం అధికంగా ఉన్న బెంగళూరు సెంట్రల్ మినహా మిగిలిన రెండు నియోజక వర్గాల కోసం మహిళానేతల పేర్లను పరిశీలిస్తోంది. బెంగళూరు దక్షిణ నుండి రవాణా, దేవాదాయ శాఖా మంత్రి ఆర్.రామలింగారెడ్డి కుమార్తె, మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి పేరును, బెంగళూరు నార్త్ నుంచి కుసుమా హనుమంతరాయప్ప పేరును పరిశీలిస్తోంది. ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో బెంగళూరులోని రాజరాజేశ్వరినగర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి మునిరత్నకు కుసుమా గట్టి పోటీ ఇవ్వడం గమనార్హం. బెంగళూరు నగరంలోని మొత్తం మూడు స్థానాలకు కలిపి కనీసం డజను మంది అభ్యర్థులు పోటీపడుతున్నారని ఈ విషయంలో తుది నిర్ణయం అధిష్ఠానం పెద్దలదేనని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

జేడీఎస్ బరిలో ఉండదు

బెంగళూరులోని మొత్తం మూడు నియోజకవర్గాల్లో ఈసారి జేడీఎస్ అభ్యర్థులు ఉండరు. బీజేపీతో పొత్తు దరిమిలా దళపతి దేవేగౌడ ఈ మేరకు సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఫలితంగా జేడీఎస్ ఓటు బ్యాంకు మొత్తం బీజేపీ వైపునకు తరలి వెళుతుందని అంచనా వేస్తున్నారు. ఇది సహజంగానే కాంగ్రెస్‌కు సవాల్‌కానుందని రాజకీయ వర్గాలు కూడా భావిస్తున్నాయి. మొత్తానికి రాజధాని బెంగళూరులో మొత్తం మూడు సిట్టింగ్ స్థానాలను గెలిచేందుకు ఒక పక్క బీజేపీ-జేడీఎస్ కూటమి ఒక పక్క, ఈ సారి ఎలాగైనా రాజధానిలో గెలిచి సత్తా చాటుకోవాలని అధికార కాంగ్రెస్ పావులను కదుపుతున్నాయి.

బెంగళూరులో ఘనంగా తిరువళ్లువర్ జయంతి

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత తమిళ కవి తిరువళ్ళువర్ జయంతి మంగళవారం ఘనంగా జరిగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర బెంగళూరు హలసూరులోని తిరువళ్ళువర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్‌తోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. బెంగళూరులో తిరువళ్ళువర్ విగ్రహం, చెన్నైలో సర్వజ్ఞ విగ్రహం ఏర్పాటులో అప్పటి ముఖ్యమంత్రులు యడియూరప్ప, కరుణానిధిలు చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం ద్వారా కన్నడ, తమిళ ప్రజల మధ్య సామరస్యానికి బలమైన పునాదులు వేశారని విజయేంద్ర కొనియాడారు. బెంగళూరులో పెద్దసంఖ్యలో నివసిస్తున్న తమిళులు స్థానిక కన్నడిగులతో మమేకమయ్యారని కొనియాడారు. సర్వజ్ఞ, తిరువళ్ళువర్‌లు సాహితీ ప్రపంచపు దిగ్గజాలు అని, వీరి వచనాలు నేటికీ మనకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కాగా తిరువళ్ళువర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులలో కృష్ణగిరి లోక్‌సభ సభ్యుడు సెల్వకుమార్, బెంగళూరు ఎమ్మెల్యేలు రిజ్వాన్‌అర్షద్, సీకే రామమూర్తి, ఎన్ఏ హ్యారిస్, డీఎంకే ఆర్గనైజర్ ఎన్ రామస్వామి, అధ్యక్షుడు ఎం పెరియస్వామి, రాష్ట్ర అన్నాడీఎంకే కార్యదర్శి ఎస్‌డీ కుమార్, డీఎంకే కోశాధికారి దక్షిణమూర్తి, లిటరరీ టీమ్ కార్యదర్శి పోర్‌మురాసు కటిరవన్, బెంగళూరు తమిళసంఘం అధ్యక్షుడు దామోదరన్‌తోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా బయ్యప్పనహళ్లి రమేశ్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేత ప్రకాశం మృతి తర్వాత తిరువళ్ళువర్ జయంతిని గత రెండేళ్లుగా నిర్విఘ్నంగా జరుపుకుంటూ వస్తున్నామన్నారు. తెలుగు, తమిళుల మధ్య సమైక్యతకు తిరువళ్ళువర్ విగ్రహం ప్రతీకగా ఉందన్నారు. కార్యక్రమంలో అభిమానులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు



నివాళులు అర్పిస్తున్న శివాజినగర్ ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్

రామకోటి నామ జపయజ్ఞ వారోత్సవం

బాగేపల్లి, జనవరి 16: అయోధ్యలో భవ్య శ్రీరామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠాపనకు అన్ని కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 22న గర్భగుడిలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠాపన జరగనున్న తరుణంలో కైవార ధర్మాధికారి ఎంఆర్ జయరాం బాగేపల్లి పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీ రామకోటి నామజప యజ్ఞ సప్తాహ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ రామనామాన్ని భక్తితో జపించడం వల్ల స్వామి కృపతో జీవనం ప్రశాంతంగా సాగుతుందన్నారు. ఇందుకు కొంచెం ఓపికపట్టాలన్నారు. శ్రీరాముడి ఆదర్శాలను ప్రతి ఒక్కరూ జీవితంలో అలవరచుకోవాలన్నారు. ధర్మసూక్ష్మాలు రామనామ తారకమంత్రాన్ని జపించడం ద్వారా వేదపారాయణ చేసినంత పుణ్యఫలం లభిస్తుందన్నారు. మానసిక ఒత్తిడి తగ్గి ముక్తి లభిస్తుందని, ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. వారం రోజుల పాటు రామకోటి జపయజ్ఞం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వై శ్రీనివాసరెడ్డి, బీఆర్ నరసింహనాయుడు, జేఎన్ నంజప్ప, నరసింహప్ప, బద్రినాథ్, సుజాత నరసింహనాయుడు, స్వర్ణగౌరి శ్రీనివాస్‌రెడ్డి, ఆదిమూర్తి, నారాయణస్వామి, అప్పయ్య, శ్రీనివాస్ బాబు, ప్రతాప్, ఆర్ వెంకటేశ్ బాబు, జంగమ ఎన్ శ్రీనివాస్, పెద్దసంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కైవార ధర్మాధికారి ఎంఆర్ జయరాం

క్రీడలతో మెరుగైన ఆరోగ్యం

మహదేవపుర, జనవరి 16: స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువ దినోత్సవాన్ని పురస్కరించుకుని హూడి స్పోర్ట్స్‌క్లబ్‌లో జీఎల్ఆర్ డెవలపర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటైన మారథాన్‌ను ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన జీవనంలో క్రమం తప్పని వ్యాయామం ద్వారా అధిగమించ వచ్చున న్నారు. తరచూ క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా దేహధారుఢ్యం, మెరుగైన ఆరోగ్యం సాధ్యమన్నారు. పోటీల్లో క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలన్నారు. 24 కిలో మీటర్ల సైకిల్ రైడ్, 10కేఎం, 5కేఎం, 2.4 కేఎం మారథాన్‌లో యువత ఉత్సా హంగా పాల్గొన్నారు. రానున్న రోజుల్లో పోటీలు మరింతగా సాగాలని ఆకాంక్షించారు. విజేతలకు పుర స్కారాలను మాజీ మంత్రి అరవింద లింబావళి ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ హోబళి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు నటరాజ్, ప్రాయోజకులు హూడి పిళ్ళప్ప, ఎల్ రాజేశ్, ప్రముఖులు శ్రీధర్‌రెడ్డి, బసవ నగర అశోక్‌రెడ్డి, సతీశ్, పవన్ శెట్టి, విజయ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ మంత్రి అరవింద లింబావళి

ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛతా పనులు

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమందిర అభియానలో భాగంగా నగరంలోని వివిపురం బిసిలు మారమ్మ ఆలయాన్ని బీబీఎంపీ కార్మికులతో కలిసి చిక్‌పేట ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ మంగళవారం శుభ్రం చేశారు. అనంతరం పౌరకార్మికులకు సంక్రాంతి కానుకలను అందజేసి గౌరవించారు. అయోధ్యలో భవ్య రామమందిరం ఈ నెల 22న ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు నగరమంతటా బీజేపీ కార్యకర్తలు, భక్తులు అన్ని ప్రముఖ ఆలయాలను శుభ్రం చేస్తున్నారన్నారు. ఆలయా లను శుభ్రం చేయడం కూడా భగవంతుడికి చేసే గొప్ప సేవ అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీబీఎంపీ మాజీ సభ్యుడు అనిల్ కుమార్, స్థానిక ప్రముఖులు కవిరాజ్, అరవింద్ చవాణ్ తదితరులు పాల్గొన్నారు.



శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్

నగరంలో అయోధ్య అక్షింతల పంపిణీ

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో అయోధ్య శ్రీరాముల అక్షింతల పంపిణీ పలు చోట్ల సాగుతోంది. కుమారస్వామి లే అవుట్‌లో సోమనహళ్ళి మఠాధిపతి గురునాథస్వామి నేతృత్వంలో ఇంటింటికీ అక్షింతలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపన అనంతరం సాయంత్రం దీపాలు వెలిగించి రాముడి చిత్రపటానికి పూజలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు రవి, హరినాయుడు, విజయ్‌కుమార్, మోహన్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



అక్షింతల పంపిణీలో గురునాథస్వామి తదితరులు

దళిత సంఘాలు రాజకీయంగా బలోపేతం కావాలి



బంగారపేట, జనవరి 16: దళిత సంఘాలు రాజకీయంగా బలోపేతం కావాల్సి ఉందని స్థానిక నాయకుడు సూలికుంటె రమేశ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో కర్ణాటక దళిత సంఘర్ష సమితి 50వ సంభ్రమ, బహుజన నాయక ఎన్ శివణ్ణ 74వ జయంతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ అనంతకుమార్‌హెగ్డే చేసిన వ్యాఖ్యలపై పరోక్షంగా ఆక్రోశం వ్యక్తం చేశారు. జిల్లా సంచాలకులు నాగనాళ మునియప్ప మాట్లాడుతూ ప్రొఫెసర్ బీ కృష్ణప్ప 1974 నుంచి సుదీర్ఘపోరాటాలు చేసి దళిత సామాజికవర్గానికి అండగా నిలిచారన్నారు. ఇలా ఎంతోమంది పలు అంశాలపై పోరాటాలు చేశారని పలు ఘటనలను ప్రస్తావించారు. జిల్లా సంఘం సంచాలకులు మునిచౌడప్ప, వెంకటరమణ, సంపత్‌కుమార్, ఈరణ్ణ, రామదాస్, గోవిందప్ప, శ్రీనివాస్ కేశవ, సునిల్‌కుమార్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

ప్రకృతి వైపరీత్యాల సహాయ నిధి నుంచి రాష్ట్రానికి రూ.348.80 కోట్లు

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘం సిఫారుల మేరకు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకృతి వైపరీత్యాల సహాయ నిధి నుండి రాష్ట్రానికి రెండో వాయిదాగా రూ.348.80 కోట్లను విడుదల చేయాలని నిర్ణయించింది. కేంద్ర హోం శాఖ సిఫార్సుల మేరకు ఆర్థికశాఖ ఈ కేటాయింపులను చేస్తోంది. ఈ మొత్తాన్ని తక్షణం రాష్ట్ర ప్రభుత్వ ఖాతాకు జమ చేయాల్సిందిగా ఆర్‌బిఐకి ఆర్థికశాఖ సూచన చేసినట్లు సమాచారం. ఎస్‌డీఆర్ఎఫ్ కోటా క్రింద రాష్ట్రానికి ఐదేళ్ళకు గాను రూ.1803 కోట్లను కేటాయించిన సంగతి విదితమే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ నిధి ద్వారా రాష్ట్రానికి రూ 929 కోట్లు రావాల్సి ఉంది. తొలి వాయిదాగా గత జులై నెలలో రూ.348.80 కోట్లను విడుదల చేశారు. తాజాగా మరో 348.80 కోట్ల విడుదలతో ఇంతవరకు రూ 697.60 కోట్లు విడుదలైంది. ఈ నిధి ద్వారా రాష్ట్రానికి ప్రస్తుత ఏడాది ఇంకా రూ.232 కోట్లు విడుదల కావాల్సి ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారి ఒకరు మంగళవారం మీడియాకు చెప్పారు.

లాల్‌బాగ్‌లో కొలువుదీరనున్న బసవణ్ణ

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాల సందర్భంగా లాల్ బాగ్‌లో ప్రత్యేక ఫలపుష్ప ప్రదర్శనకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈసారి 215వ ప్రదర్శనలో విశ్వగురు బసవణ్ణ అనుభవ మంటప నమూనాను లక్షలాది పూలతో సిద్ధం చేస్తున్నారు. 18న ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రదర్శన ప్రారంభం కానుండగా ఇది 28వరకు కొనసాగుతుందని తోటల అభివృద్ధిశాఖ కార్యదర్శి డాక్టర్ షమ్లా ఇక్బాల్ మంగళవారం మీడియాకు తెలిపారు. లింగాయత మఠాధి పతుల తోపాటు శరణ సాహితీవేత్తలను కూడా ప్రత్యేకంగా ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నామన్నారు.

సిట్‌కు అప్పగించేందుకు నిరాకరణ.. గ్యాంగ్‌రేప్ కేసు మూసివేసేందుకు కుట్ర

- మాజీ సీఎం బొమ్మై ఆరోపణ

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): హావేరి జిల్లాలో మైనార్టీ మహిళలపై జరిగిన సామూహిక అత్యాచారం ఘటనపై సిట్ విచారణ అవసరం లేదన్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై నగరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ హావేరి గ్యాంగ్‌రేప్ కేసును మూసివేయం ఖాయమన్నారు. ఇప్పటికే జిల్లా పోలీసు యంత్రాంగం ఈ కేసును నీరుకార్చే యత్నాలను ప్రారంభించిందని తూతూ మంత్రం అన్నట్లు కొందర్ని అరెస్టు చేసిందన్నారు. సిట్ విచారణను నిరాకరించడం అంటే గ్యాంగ్ రేప్‌లకు లైసెన్సులను ఇచ్చినట్లేనని ఆయన ఘటుగా వ్యాఖ్యానించారు. ఈ కేసులు నిందితులు మైనార్టీ మతానికి చెందిన వారు కావడంతో వారిని రక్షించేందుకు తెరచాటున ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. బాధితురాలిని బెదిరించి నిందితులు తమకు అనుకూలంగా కేసును మలచుకు న్నారన్నారు. కాగా బాధితురాలికి పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతోనే వైద్య చికిత్సలు అందించాలని ఆమెను అన్ని విధాలా ఆదుకోవాలని బొమ్మై ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీపీఆర్ శిక్షణకు అనూహ్య స్పందన



సీపీఆర్‌పై అవగాహనలో మంత్రి దినేశ్ గుండూరావు తదితరులు

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురైన వారిని ఆసుపత్రికి తీసుకెళ్ళే ముందు అత్యవసరంగా ప్రాథమిక చికిత్స చేస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. గుండెపోటుకు గురైన వ్యక్తిని కిందగానీ, బల్లపైగానీ పడుకోబెట్టి గుండె వద్ద క్రమ పద్ధతిలో నొక్కడం, కృత్రిమ శ్వాసను అందించం వంటి ప్రక్రియలను కార్డియో పల్మనరీ రెస్కుసిటేషన్ (సీపీఆర్) అంటారు. కొవిడ్ అనంతరం గుండెసంబంధ సమస్యలు అధికడం కావడంతో రాష్ట్ర ఆరోగ్య శాఖ ఈ విషయంలో ప్రజలను జాగృత పరిచే పనులను సర్జికల్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహిస్తోంది. సర్జికల్ సొసైటీ ఆఫ్ ఇండియా స్వర్ణోత్సవాల నేపథ్యంలో ఆరోగ్య, హోం శాఖల సహకారంతో సీపీఆర్ శిబిరాలను నిర్వహిస్తున్నారు. నిత్యం ఒత్తిళ్ళ మధ్య పనిచేసే పోలీసు సిబ్బందికి కోసం నగరంలో గత కొన్ని రోజులుగా ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ బీ దయానంద్ నగరంలో మంగళవారం మీడియాకు చెప్పారు. ఈ శిక్షణకు అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. పాత్రికేయులకు కూడా ఈ తరహా శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ఆరోగ్య శాఖా మంత్రి దినేశ్ గుండూరావ్ వెల్లడించారు.

మండ్యలో లవ్ జిహాద్ కలకలం

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లాలోని కేఆర్‌పేటలో విభిన్న మతాలకు చెందిన యువతీ, యువకుడు నాటకీయంగా అదృశ్యం కావ డంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. 19ఏళ్ల సయ్యద్ తబ్రేజ్ ఈనెల 12న హిందూ మతానికి చెందిన 15ఏళ్ల బాలికతో సన్నిహితంగా ఉండడాన్ని కొందరు గమనించారు. దీనిపై స్థానికంగా ఉభయ కుటుంబాల మధ్య గొడవలు కూడా జరిగాయి. బాలిక తల్లిదండ్రులు ఇప్పటికే కేఆర్‌పేట పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయగా పోక్సో చట్టానికి అనుగుణంగా కేసు నమోదు చేసి గాలిస్తున్నారు. కాగా లవ్‌జిహాద్ పేరిట యువతిని వలలో వేసుకున్నాడని దీనిపై సమగ్ర విచారణ జరపాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి.

ప్రపంచం చూపంతా అయోధ్యవైపే...

- పండుగ జరుపుకొందాం : వీహెచ్‌పీ పిలుపు

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం చూపంతా అయోధ్య రామ మందిరంవైపే ఉందని 500 సంవత్సరాల తర్వాత భవ్యరామమందిరం ప్రారంభం కానుండడం హిందువుల అదృష్టమని విశ్వహిందూ పరిషత్ పేర్కొంది. వీహెచ్‌పీ ప్రాంతీయ కార్యదర్శి జగన్నాథశాస్త్రి ఈమేరకు బెంగళూరులో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రామమందిరంలో విగ్రహాల ప్రతిష్ఠాపన శుభ ఘడియలకోసం ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది హిందువులు కళ్లుకాయలు కాచు కునేలా ఎదురుచూస్తున్నారన్నారు. దీన్ని హిందువులంతా పండుగలా జరుపు కోవా లని, హోమం, యజ్ఞం, హారతులు, జపాలు, భజనలు, ప్రవచనాలు వంటివి స్థానిక ఆలయాల్లో నిర్వహించాలని పిలుపునిచ్చారు. సూర్యాస్తమయం తర్వాత ఐదు జ్యోతులను వెలిగించాలని సూచించారు. భారతీయులంతా ఈ మహాకార్యంలో పాలు పంచుకోవాలని ఆరోజు వాణిజ్య కార్యకలాపాలకు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి నగరంలో కేక్ ఫెస్టివల్

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నోరూరించే కేకులను అందంగా తీర్చిదిద్దడం కూడా ఒక కళే సుమా. కేకుల తయారీలో అనేక విశ్వవిద్యాలయాలు ప్రత్యేక కోర్సులు నిర్వహిస్తున్నాయి. బెంగళూరు జేపీనగర్‌లోని శుభ్ కన్వెన్షన్‌లో ఈనెల 18నుంచి 20వరకు కేకాలజీ, కేక్ ఫెస్టివల్ జరగనుంది. ప్రపంచ ప్రఖ్యాత పాకశాస్త్ర నిపుణుడు రియోనిడ్ వెబ్, స్థానిక పాకశాస్త్ర నిపుణుడు, ప్రాచీ దబల్‌దేవ్ ఈ సందర్భంగా జరిగే పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. కేక్ తయారీ పోటీలు, 24 ఉచిత మేక్ ఇట్, టేకిట్ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా 18 ప్రత్యక్ష ప్రదర్శనలు కూడా ఉంటాయని కేక్ నిపుణుడు స్వామి రామచంద్రన్ జయరామన్ క్యూరేటర్‌గా వ్యవహరిస్తారని నగరంలో మంగళవారం విడుదలైన ప్రకటన పేర్కొంది.

ట్యాంకుల ద్వారా నీటి సరఫరా

శిడ్లఘట్ట, జనవరి 16: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజలు నీటి కొరతను ఎదుర్కొనరాదనే ఉద్దేశ్యంతో ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. పట్టణంలోని 11, 12, 21 వార్డులలో అనిల్‌కుమార్ తన సొంతఖర్చుతో నీటిని సమకూర్చారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ బోరుబావులు రిపేరీలో ఉన్నాయని వాటిని బాగు చేస్తే సమస్య చాలావరకు పరిష్కారం కానుందన్నారు. ఇదే సందర్భంగా స్థానికుల సమస్యలను ఆలకించారు.